
“అమ్మా” అనుకుంటూ కడుపు పట్టుకుంది బుజ్జి.

అప్పటికి, అర్థరాత్రి దాటింది. ఆ యింటి పెరడులో ఓ మూల బిక్కుమంటూ వున్న గులాబీ మొక్క గాలికి అటూ యిటూ వూగుతోంది. అప్పుడే విరిసిన ఓ గులాబీ తన కిందున్న ముళ్ళు ఎక్కడ గుచ్చుకుంటాయోనని భయపడుతున్నట్టుంది. దట్టంగా కురుస్తున్న మంచు గులాబీ రేకుల నుంచి జారుతూ ఆ ఒంటరి పువ్వు కన్నీరు కారుస్తున్నట్టుంది.

# నిర్ణయం

కె.వి.యస్.వర్మ






“అమ్మా, అమ్మా” అంటూ కడుపు పట్టుకుని, లేచి కూర్చుంది బుజ్జి.

ఆ హాల్లో బెడ్‌లైట్ ఎర్రగా వెలుగుతోంది. బుజ్జి చేతికి లంగా తడిగా తగిలింది. “ఏంటిదీ” అనుకుంటూ బాత్ రూమ్‌లో కెళ్ళింది. “అమ్మో” అనుకుంటూ భయపడిపోయింది.

‘బుజ్జి’ ఆమె ముద్దు పేరు. అసలు పేరు సూర్యకాంతం. ఆ పేరుతో పిలిస్తే బుజ్జి ఎవరివో పిలుస్తున్నారనుకుంటుంది. ఆర్నెల్ల క్రితం మారుమూల పల్లెటూరు నుంచి పనిపిల్లగా విశాఖపట్నం వచ్చింది. ఆమెకీ మధ్యే పన్నెండేళ్ళు నిండాయి.

బాత్‌రూమ్ నుంచి వచ్చి బుజ్జి లంగా మార్చుకుంది. పైకి శబ్దం రాకుండా ఏడుస్తూ, మళ్లీ బాత్‌రూమ్ కెళ్ళి సబ్బు పెట్టి లంగా ఉతుక్కుంది.

‘ఆంధ్రజ్యోతి’ సచిత్రవారపత్రిక



బుజ్జి గుండెల్లో భయం. కళ్ళల్లో భయం. కాళ్ళల్లో, చేతుల్లో భయం. ఆమె బుర్రలో ఏదో అస్పష్ట భావం. ఎవ్వడో తనూళ్లో విన్నట్టో, కన్నట్టో తెలిసీ తెలియని తనం. లంగా ఆరేసి హాల్లోకొచ్చి బొంత మీద పడుకుంది. ఆమెకు కన్నీళ్లాగడం లేదు.

తల్లిని తలచుకోగానే బుజ్జికి మరింత ఏడుపు వచ్చేసింది. ఆ రాత్రంతా ఆమెకు నిద్ర పట్టలేదు. ఆ హాలు ఆమెకు చీకటి గుహలా వుంది. బెడ్ లైట్ దెయ్యం కన్నులా వుంది.

రోజూలాగే అయిదున్నరకే పాలవాడు కాలింగ్ బెల్ నొక్కాడు. బుజ్జి ఉలిక్కిపడి లేచింది. లైటు వేసి, తలుపు తీసింది. పాల పేకెట్లు వంట గదిలో పెట్టింది. లైటార్పి మళ్ళీ పడుకుంది.

అమ్మ, నాన్న, తమ్ముడు, బుజ్జి కళ్ళ ముందు కదిలారు. బుజ్జికి మళ్ళీ కన్నీళ్ళొచ్చేశాయి.

తులసి కొడుకు నెత్తుకుని బెడ్‌రూమ్ తలుపు తీసుకుని హాల్లోకొచ్చింది. బాత్‌రూమ్‌కు వెళ్తూ, "బుజ్జీ! లే" అని కేకేసింది.

బుజ్జి గబుక్కున లేచి కూర్చుంది.

తులసి కొడుకు చేత పాస్ పోయించి, "బుజ్జీ, వీడ్ని తీసుకోవే" అంది.

బుజ్జి వాడ్ని ఎత్తుకుంది. తులసి పాలపేకెట్లు బ్లేడుతో కోసి, పాలను గిన్నెలో పోసింది. స్టవ్ వెలిగించి, దాని మీద గిన్నె పెట్టింది.

"అమ్మగోరూ" అంటూ చెబుదామనుకున్న బుజ్జికి నోరు పెగల్లేదు. ఏదో పరాయితనం అడ్డు వచ్చింది.

చీపురు తీసుకుని బుజ్జి వంట గది తుడిచింది. హాలు తుడిచింది. నీరసం, అలసట. చెప్పలేని భయం.

తులసి ఇచ్చిన కాఫీ కప్పు చేత్తో పట్టుకుని,

"అమ్మగోరు, నాను మా వూరెళ్ళి వస్తానండి" అంది బుజ్జి.

"మొన్ననే కదే వెళ్ళొచ్చావ్. రెండు మూడు నెలలు పోయాక వెళ్దువు గానిలే"

"మా అమ్మను సూడాలనుందనండి"

"ఏం చిత్రమే. అమ్మ నీకొక్కర్తికే వుందేటే. నాకూ అమ్మ వుంది. నేను మా అమ్మను చూసి సంవత్సరమయింది. నువ్వు మీ అమ్మను చూసి వెళ్లాళ్లు కూడా కాలేదు. రేపు పెళ్లయ్యాక కూడా అస్తమానం 'మా అమ్మను చూసొస్తా'నంటూ నీ మొగుడితో అనేలా వున్నావ్" అంది తులసి నవ్వుతూ.

బుజ్జి సిగ్గుపడి ఇంకేమీ అనలేకపోయింది. రాత్రి భోంచేశాక పడేసిన కంచాలూ, గిన్నెలూ కడగడం మొదలెట్టింది. ఎప్పుడూ లేనంత నీరసం, విసుగు. గుండెల్లో ఏదో గుబులు.

బాబుకు స్నానం చేయించి, పౌడరు రాసి బట్టలేసి బుజ్జి చేతికిచ్చి వంట పనిలో పడింది తులసి.

స్టవ్ మీంచి కూరగిన్నె దింపి టైం చూసింది తులసి. ఎనిమిదింపావు. "అమ్మబాబోయ్" అనుకుని చారుకు నీళ్ళు పెట్టి "కాస్త చూడవే" బుజ్జితో అని బాత్‌రూమ్‌కు పరుగెట్టింది.

పరుగు. చదువుకు పరుగు, ప్రేమకు పరుగు, పెళ్ళికి పరుగు, ఉద్యోగానికి పరుగు, ఇంటికి పరుగు, బజారుకు పరుగు. నేడు జీవితమే ఓ పరుగు పందెం.

మధుసూదన్ బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని మంచం మీంచి లేచి, వాష్ బేసిన్ దగ్గరకొచ్చాడు. బ్రష్ చేసుకున్నాడు. ఫ్లాస్కు లోంచి కాఫీ కప్పులో పోసుకుని తాగాడు. కొడుకు నెత్తుకుని ముద్దులాడాడు.

తులసి స్నానం చేసి, బట్టలేసుకుంటూ, "ఇంకా పేపరు చూస్తూ కూర్చున్నారేం. టైమెంతయిందో చూశారా, త్వరగా తయారవండి. నేను మాత్రం ఇవేళ ఆఫీసుకు ఆటోలో వెళ్ళిపోతున్నా. ఇన్‌స్పెక్షన్ ఒకటి తగలడింది" అంది.

తర్వాత హేండ్ బ్యాగ్‌లో డబ్బులున్నాయో లేదో చూసుకుంది. కొడుకు నెత్తుకుని ముద్దు పెట్టుకుంది.

"బుజ్జీ, పెత్తనాలకు పక్కిళ్ళకెళ్ళకు. బాబును జాగ్రత్తగా చూడు. పది గంటలకల్లా అన్నం పెట్టు" అంటూ ఇంకా ఏవేవో పురమాయించి తులసి వీధిలోకి వెళ్లింది.

మరో అరగంటకు మధుసూదన్ కూడా తయారయి, స్కూటర్ స్టార్ట్ చేసి ఆఫీసుకెళ్ళిపోయాడు. బాబు నిద్రలోకి జారిపోయాడు.

అంతవరకూ బలవంతంగా ఆపుకున్న కన్నీళ్ళు వరద గోదారిలా బుజ్జి చెక్కిళ్ల మీదకు ప్రవహించాయి. ఈ ఇంటిలో, ఈ నగరంలో ఈ ప్రపంచంలో తను ఒంటరిదాన్నన్న భావన ఆమెలో కలిగింది. స్నానం చేస్తున్నప్పుడూ భయమే. లంగా మార్చుకున్నప్పుడూ భయమే.

బుజ్జికి అమ్మ గుర్తొచ్చింది. నాన్న గుర్తొచ్చాడు. తమ్ముడు గుర్తొచ్చాడు. వాళ్ళను తలచుకుంటూ ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది.

బాబు ఏడుపుకి బుజ్జికి మెలకువ వచ్చేసింది. ఒంటిగంటయ్యింది. అన్నం మెత్తగా కలిపి బాబుకి పెట్టింది. వాడి ముందు బొమ్మలు పడేసి ఆడించింది. బాబును ఆడిస్తుంటే తమ్ముడు జ్ఞాపకానికొచ్చాడు. పొలం గట్ల పైనా, మామిడి తోటల్లోనూ తమ్ముడి నెత్తుకుని తను తిరిగిన రోజులు గుర్తొచ్చి ఆమెకు మళ్లీ కన్నీళ్లొచ్చాయి. కళ్ళు తుడుచుకుని టి.వి. పెట్టింది. స్టార్ టి.వి.లో ఏవో పాటలొస్తున్నాయి. బుజ్జి ఓ నిర్ణయానికొచ్చేసింది. సంచిలో తన బట్టలు సర్దుకుంది.

ఓ గంట గడిచింది. కాలింగ్ బెల్ మోగింది. బుజ్జి తలుపు తీసింది. తులసి!

"అప్పుడే వచ్చేసినారేంటమ్మగోరూ"

"ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ అయ్యేటప్పటికి తలపోటు వచ్చేసిందే. పర్మిషన్ తీసుకుని వచ్చేశాను. బాబేం అల్లరి చెయ్యలేదు కదా"

"నేదండి. ఇందాకటి దాకా ఆడుకునాడుకుని ఇప్పుడే నిద్రపోయాడు"

"టీ గిన్నెతో నీళ్ళుతే. టీ తాగితేనే కానీ తలపోటు తగ్గేలా లేదు" అంది తులసి.

బుజ్జి గిన్నెలో నీళ్ళు తెచ్చి స్టవ్ మీద పెట్టింది.

తులసి ముఖం కడుక్కుని వంట గదిలోకి వెళ్ళింది. బుజ్జి 'ఇదే అదను' అనుకుంటూ సంచి పట్టుకుని బయటపడింది.

* * *

బాబు ఏడ్పుకి తులసి నిద్ర లేచింది.

"బుజ్జీ" అని పిలిచింది.

జవాబు రాలేదు.

"పెత్తనాలకెళ్ళి ఇంకా 'రాలేదన్నమాట. కొంచెం ఖాళీ దొరికితే చాలు పక్కిళ్లకు పోతుంది"అనుకుంటూ బాబును తీసుకుని బాత్‌రూమ్ కెళ్ళింది తులసి.

బాబుకి స్నానం చేయించి, బట్టలేసింది. టి.వి. పెట్టింది.

'బుజ్జింకా రాలేదేమిటి' అనుకుంది మళ్ళీ.

రాత్రి ఎనిమిదవ్వరకు మధుసూదన్ ఆఫీసు నుంచి వచ్చాడు.

"బుజ్జి, మన పక్కిళ్లలో ఎక్కడో పెత్తనాలు చేస్తోంది. కాస్త పిలవండి" అంది తులసి.

మధుసూదన్ వీథిలోకెళ్లాడు. ఓ పావు గంటకు తిరిగొచ్చాడు.

"బుజ్జి ఎవరింటికీ రాలేదట"

"రాలేదా, మరెక్కడికెళ్ళుంటుంది"

"అదే తెలియడం లేదు. ఒకవేళ ఎం.వి.పి. కాలనీలోని వాళ్ళ చుట్టాలింటికెళ్ళిందేమో"

"చెప్పకుండా వెళ్లదే... పోనీ, వాళ్లింటికెళ్లి చూసి రాకూడదూ" అంది తులసి.

మధుసూదన్ చిరాకు పడుతూనే స్కూటర్ స్టార్ట్ చేశాడు.

కొడుక్కి అన్నం తినిపించి, హాల్లోకొచ్చి కుర్చీలో కూర్చుంది తులసి.

అప్పడామెకు గుర్తొచ్చింది, బుజ్జి పొద్దుట ఊరెళ్తానని అడిగిన విషయం.

'ఒకవేళ వాళ్లూరు కైకమోలు వెళ్లిందేమో' అనుకుంది తులసి.

ఆ అనుమానం రాగానే తులసి బుజ్జి బట్టల కోసం వెదికింది. కనిపించలేదు. ఆమె సంచి కూడా కన్పించలేదు. దాంతో తులసికి భయం వేసింది.

"రైలు టిక్కెట్టుకి కూడా దాని దగ్గర డబ్బు లుండి వుండవు. ఎప్పుడూ ఒక్కర్తీ వెళ్ళలేదు. ఎలా వెళ్లుంటుంది" అని తులసి ఆలోచిస్తోంది.

"బుజ్జి వాళ్ళ చుట్టాలింటికి కూడా వెళ్ళలేదు" అన్నాడు మధుసూదన్ స్కూటర్ స్టాండ్ వేస్తూ బయటి నుంచే గట్టిగా.

భర్త లోపలికొచ్చి, సోఫాలో కూర్చున్నాక, తులసి తన అనుమానం చెప్పింది

"ఇప్పుడేం చేద్దాం" అని ఇద్దరూ ఒకేసారి అన్నారు.

ఇద్దరికీ ఏం చెయ్యడానికీ పాలుపోలేదు.

"చేతిలో డబ్బుల్లేకుండా వెళ్ళిందంటున్నావ్. వాళ్లింటికి సరిగా వెళ్లగలదో లేదో. అసలే టిక్కెట్ లేని ప్రయాణం.... మధ్యలో ఏదన్నా జరిగితే..." అన్నాడు మధుసూదన్ ఆందోళనగా.




## కరి మింగిన వెలగపండు

అవకతవకల తివాసీ మీద
కాళ్ళు విరిగిన ధర్మాసనం
కృత్రిమ అవయవాల కోసం
బేరసారాలు జరువుతుంది
మొన్నటి నమ్మకాల మర్రిచెట్టుమీద
నిన్నటి పాఠాల ప్రాణపక్షులు
ఈనాటి అనుభవ పాశాలతో ఉరేసుకుంటాయి
స్వరపేటికల్లోంచి ఆయుధాలు దూసుకొస్తాయి
ఆకాశంనిండా ఇంద్రధనుస్సులు పొడుచుకొస్తాయి
సముద్రం శంఖారావం చేస్తుంది
తర్జనలు మూకుమ్మడిగా హెచ్చరిస్తాయి
రంగం సిద్ధమవుతుంది
నాందీప్రస్తావనలు జరిగిపోతాయి
విదూషకులు రంగాన్ని అలంకరిస్తాడు
నిందలూ ప్రతినిందలూ విందు చేసుకుంటాయి
సందర్భాలు అసందర్భాలు చరిత్ర చెదలు దులువుతాయి
అభినయించే తోలుబొమ్మలు
మధ్యమధ్య భుజస్కందాలను తడుముకుంటాయి
దృశ్యం రసకందాయంలో పడుతుంది
నిలువునా చీలిపోతున్న శవాలు
శల్య పరీక్షలు జరువుతాయి
అగ్నిపూతం కాని అంతరాత్మలు
ఆత్మహననం చేసుకుంటాయి
సత్యాసత్యాలు తీగెల్నీ డొంకల్నీ ఆశ్రయిస్తాయి
పరుగెత్తి పరుగెత్తి కాలం అలసిపోతుంది
గర్జించిన మేఘాలన్నీ కప్పదాట్లు వేస్తాయి
తోకలన్నీ ముడుచుకుపోతాయి
కార్యాచరణ కరవాలానికి తుప్పపడుతుంది
కథ కంచికి వెడుతుంది
విశ్వాసంమీద ఫలశ్రుతిని విసర్జిస్తూ

—వేమూరి వెంకటేశ్వర శర్మ

"ఏదన్నా జరిగితే..." అంటూ ఆగిపోయింది తులసి.

ఇక వాళ్ళిద్దరికీ ఆ రాత్రి నిద్ర పట్టలేదు.

బుజ్జిని పనిపిల్లగా కుదర్చి పంపిన మిత్రుడు గోపాలం గుర్తుకొచ్చాడు మధుసూదన్‌కు. కాకినాడ ఫోన్ చేసి, విషయం చెప్పాడు గోపాలానికి. బుజ్జి ఇంటికి చేరితే ఆ విషయం వెంటనే తనకు ఫోన్ చేసి చెప్పమన్నాడు మధుసూదన్.

భారంగా తెల్లవారింది.

మధుసూదన్, తులసి ఆఫీసుకు సెలవు పెట్టి గోపాలం ఫోన్ కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు.

కైకమోలు వెళ్ళి రహస్యంగా కనుక్కుని, కాకినాడ తిరిగొచ్చి, "బుజ్జి వాళ్లింటికి రాలేదు" అని గోపాలం మధ్యాహ్నం ఫోన్ చేసి చెప్పాడు. మళ్ళీ సాయంత్రం కూడా ఫోన్ చేసి, అదే మాట చెప్పాడు.

మధుసూదన్‌లో టెన్షన్ పెరిగిపోయింది. పోలీస్ కంప్లయింట్ ఇచ్చాడు.

విషయం విన్న మిత్రులు తలొక మాట అంటుంటే ఇక్కడ తులసి, మధుసూదన్, అక్కడ గోపాలం భయపడిపోయారు.

"అసలే రోజులు బాగోలేవు. ఏ బ్రోతల్ కంపెనీకన్నా ఎవరన్నా అమ్మేసేరేమో"

"ఏ ఆవారా గాళ్లన్నా ఏదన్నా అఘాయిత్యం చేసేరేమో"

"ఏ అరబ్ షేక్ కన్నా అమ్మేసేరేమో"

... ఇలా నలుగురూ తలో మాట అంటుంటే ఇక్కడ తులసి, మధుసూదన్‌లకూ, అక్కడ గోపాలానికీ అనుమానాలు పెనుభూతాలయ్యాయి.

"బుజ్జీ వాళ్ళ అమ్మానాన్నలకు ఏం చెప్పాలి?" అని తులసి, మధుసూదన్ పదే పదే అనుకున్నారు.

"బుజ్జి తమ వూరి పిల్ల. ఏదన్నా జరిగితే, తను వూళ్లో తలెత్తుకు తిరగ్గలడా?" అనుకుంటూ గోపాలం బెంబేలుపడిపోయాడు.

వాళ్లెవరికీ రెండోరోజు రాత్రి కూడా నిద్ర పట్టలేదు.

"నేను ముందే చెబితే విన్నావా? అంత దూరం నుంచి పని పిల్లను తెచ్చుకోవడం ఎందుకన్నాను. బాబును చిల్డ్రన్ కేర్‌కు పంపుదాం అన్నాను. నువ్వినలేదు. చూడు, ఇవ్వడేం జరిగిందో" అన్నాడు మధుసూదన్.

"పనిపిల్ల వుంటే బాబునూ చూస్తుంది. ఇంట్లో చిన్న చిన్న పనులకు ఆసరాగానూ వుంటుందనుకున్నాను. ఇలా జరుగుతుందని నేను మాత్రం అనుకున్నానా" అంది కోపంగా తులసి.

కాసేపు ఇద్దరూ మౌనంగా వుండిపోయారు.

"పుణ్యానికి పోతే పాపం ఎదురయ్యిందంటారు, ఇదేలాగుంది. ఏ ఘోరం జరక్కుండా చూడు తండ్రీ" అని గోపాలం అన్నవరం సత్యనారాయణ స్వామిని వేడుకున్నాడు.

మూడో రోజు మధ్యాహ్నం గోపాలం 'బతికానురా దేవుడా' అనుకున్నాడు.

'ఇంకెవ్వరూ మధ్యవర్తిగా వుండి ఏ పనిపిల్లనూ ఏ వూరికీ పంపనంటే పంపను' అని గట్టిగా అనుకుని, మధుసూదన్‌కు ఫోన్ చేసి చెప్పాడు బుజ్జి వాళ్లింటికి చేరిందని.

ఆ మాట విని మధుసూదన్, తులసి ఊపిరి పీల్చుకున్నారు.

"మళ్ళీ ఇంకో పనిపిల్ల కావాలని అనకు"

"ఈ అనుభవం చాలు. మళ్లీనా"

ఇద్దరూ వరద నీటిలో కొట్టుకుంటూ ఒడ్డుకు చేరుకున్నట్టుగా ఫీలయ్యారు.

సరిగ్గా అదే సమయానికి కొంచెం ముందు, కైకమోలులో, వో వూరింట్లో–

"ఒక్కద్దానివీ అంత దూరం నుంచి ఎలా వచ్చేవే" అని తల్లి అడగ్గానే ఆమెను కౌగలించుకుని ఏడ్చేసింది బుజ్జి.

"పేసింజరు ట్రెయినెక్కేసేనే. బాగా రాత్రయిపోనాదే. అనకాపల్లిలో టికెట్టు కలట్రు దింపేసేడే. ఆ టేసన్లో ఓ బెంచీ మీద పడుకున్నానే. నిద్దరట్టేసింది. తెల్లారేక మెలకవొచ్చిందే. సివాద్రి ఎక్సుప్రెస్సొస్తే అదెక్కానే. పిటావురంలో మళ్ళీ టిక్కెట్టేదంటూ దింపేసేడే. సాయింత్రం ఇంకో రైలెక్కి, ఎలాగయితేనో కాకినాడ వచ్చానే. అక్కడ బెంచీ మీద నిద్దరోయి, తెల్లారకట్టే బయల్దేరి నడిసొచ్చానే" అని చెప్పింది బుజ్జి.

"ఓసి తల్లి ఓసి తల్లి. ఎంత పని చేసేవే, నా సిట్టితల్లీ. అక్కడయ్యగోరికి సెప్పకుండా రాడం తప్ప గాదేటే. ఇంకోసారి అట్టా సెయ్యకమ్మా"

"అమ్మా, అమ్మా అమ్మా, నన్ను మళ్లీ అక్కడికంపితే, సచ్చిపోతానే" అంటూ బుజ్జి తల్లిని గట్టిగా వాటేసుకుంది.

"సుబ్బరంగా మంచి తిండీ, బట్టా దొరుకుతుంటే రోగమేటే ఎల్లనంటావ్"

"వాకయ్యేవీ వద్దే అమ్మా. నువ్వూ, నాన్నా, తమ్ముడూ, మనూరు వుంటే సాలే అమ్మా" అని వెక్కి వెక్కి ఏడుస్తూ బుజ్జి తల్లిని విడిచిపెట్టలేదు.

"సాల్లే సాల్లే, వూరుకో. నిన్నిడిసి వుంటం మాకు మాత్రం ఇష్టవేటే. కలో గంజో కలిసే తాగుదాంలే" అని తల్లి అనగానే, ఆమె చెవిలో నెమ్మదిగా చెప్పింది బుజ్జి.

"అమ్మ తల్లీ. నువ్వు పెద్ద మడిసివయ్యేవే" అంది బుజ్జితల్లి ఆమె తల నిమురుతూ.

(శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి 'వేతనశర్మ' కథలోని ఓ వాక్యం ఆధారంగా ఈ కథ)


Safety
Security
Stability
Service

Interest from 14% to 20% p.a.
No speculation, solid investments only.
Loans against gold jewelry and immovable properties.
Attractive savings deposit schemes.
Special schemes for pensioners and housewives.
Safe deposit locker facility for your valuables.
Simple procedures and documentation.
Visit personally, or ring during working hours,
10 A.M to 6 P.M, on
all days except sundays and holidays.

1st Benefit Fund Company In Twin Cities.

For your requirements, contact immediately :
SREE TEJA BENEFIT FUND LIMITED
Rahmat Commercial Complex, 106, First Floor, Ameerpet X Roads,
Hyderabad - 13. Phone : 290576, 292663.

ALL TRANSACTIONS WITH SHAREHOLDERS ONLY

G.I./STB/1094